డెంగీ నివారణకు పకడ్బందీ చర్యలు

ప్రతి రోజు యాంటీ లార్వా ఆపరేషన్లు ఉదయం 8 గంటలకే ప్రారంభించాలి

అధికారులకు దిశా నిర్దేశం చేసిన పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్

సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): డెంగీ, మలేరియా, చికున్ గున్యా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అధికారులు, జిల్లా కలెక్టర్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్లు, సీనియర్ ఎంటమాలజీ, ఏఎంహెచ్ఓలు, తహశీల్దార్లు, అసిస్టెంట్ ఎంటమాజిస్టులు చేపట్టాల్సిన కార్యాచరణపై దాన కిశోర్ గురువారం దిశా నిర్దేశం చేశారు. డెంగీ పాజిటివ్ కేసుల నిన్నింటిని తనిఖీ చేయాలని, ప్రతిరోజు బస్తీ దవాఖానలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని చెప్పారు. జోనల్ కమిషనర్లు డెంగీ మలేరియా చికున్ గున్యా, ఇతర వ్యాధులపై క్రమం తప్పకుండా డీసీలు, ఎస్ఈలు, ఏఈలతో సమీక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లను సందర్శించి డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి రోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని దాన కిశోర్ సూచించారు. స్లమ్ ఏరియాల్లో పాజిటివ్ కేసులు గల ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని, సీనియర్ ఎంటమాలజిస్టులు, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులు ప్రతిరోజు ఐదు నుంచి ఆరు ప్రాంతాలను తప్పకుండా రీ చెక్ చేయాలని సూచించారు.



జీహెచ్ఎంసీలో చేపట్టిన చర్యలు

- డెంగీ నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుని వర్షాకాలం ముందు నుంచి ఇప్పటి వరకు పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.
- అందులో 9,680 లార్వా హౌసెస్, 767 ఫంక్షన్ హాళ్లలో, 6,157 లాయింగ్ ఏరియా, ఓపెన్ ప్లేస్, 4,635 సెల్లర్స్, 6,370 కన్స్ట్రక్షన్ సైట్లలో, 3,045 పాఠశాలలు, 427 కళాశాలలు, 554 హాస్టళ్లలో ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించారు.
- 27,608 ప్రాంతాల్లో, ప్రదేశాలలో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు.
- గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న స్లమ్ ఏరియాలో పాజిటివ్ నమోదైన కాలనీలలో పిన్ పాయింట్ ప్రోగ్రాం ద్వారా ఫాగింగ్ చేశారు.
- 4,846 కాలనీలలో ఇంటింటితో పాటు ప్రతి శుక్రవారం డ్రైడే ఐఈసీ కార్యక్రమాలు నిర్వహించారు.
- అదే విధంగా వెక్టర్ బ్రోన్ వ్యాధులపైన రెసిడెన్షియల్ అసోసియేషన్, ప్రతినిధులు కాలనీ ప్రజలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.
- 2,751 మంది ఆయా పాఠశాలల విద్యార్థులు వాలంటీర్లుగా గుర్తించి వారితో డెంగీ వ్యతిరేక పోరాటం చేసేందుకు అవగాహన ఇవ్వడం జరిగింది.
- డెంగీ జ్వరం వచ్చిన బాధితులకు 4 – 5 రోజుల్లోనే డెంగీ ఎలిసా టెస్ట్ ద్వారా గుర్తించి, నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

చదువు మధ్యలో ఆపేసిన వారికి అద్భుత అవకాశం

దరఖాస్తులను ఆహ్వానిస్తున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ

పిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): వివిధ కారణాల వలన చదువు మధ్యలో ఆపేసిన వారి కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అద్భుత అవకాశం ఇస్తుంది. పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి డి.రోహిణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్యసందించేందుకు ఈ అవకాశం కల్పించినట్టు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో ప్రవేశం పొందాలనుకునే వారు స్టడీ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వెబ్‌సైట్ telanganaopenschool.org లో దరఖాస్తు ఫారం లభిస్తుందని వివరించారు. మరింత సమచారం కోసం ఫోన్ నం. 80084 03516ను సంప్రదించాలని డీఈఓ తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. అపరాధ రుసుంతో అక్టోబర్ 3 వరకు అవకాశం ఉందని చెప్పారు.

బ్యాంక్ ఆఫ్ బరోడాచే 'సబ్ మే హై ఖిలాది' క్యాంపెయిన్ షురూ..

ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడ గురువారం 'సబ్ మె హై ఖిలాది' క్యాంపెయిన్ ప్రారంభించింది. కాగా, ఈ ప్రచారంలో ప్రముఖ క్రీడాకారులు పీవీ సింధు, క్రికెట్ స్టార్ షఫాలీ వర్మ, టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ వినాయక్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఉప్పల్, ఆగస్టు 29: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో గురువారం అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఉప్పల్ భగాయత్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను సిబ్బందితో కలిసి టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ మేరకు భగాయత్‌లోని రేకుల షెడ్లను యంత్రాల సహాయంతో కూల్చివేశారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో 140 ఇండ్లకు నోటీసులు

మల్కాజిగిరి: చిన్న రాయుని చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని 140 అక్రమ నిర్మాణాలకు అల్వాల్ మండల తహసీల్దార్ రాములు నోటీసులు జారీ చేశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని చిన్న రాయుని చెరువు బఫర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిసర ప్రాంతాలలో అక్రమంగా నిర్మించిన 140 ఇండ్లకు నోటీసులు జారీ చేశారు. నోటీసులలో ఇండ్లను త్వరలో తొలగిస్తామని స్పష్టం చేశారు.

నాచారంలో బఫర్‌జోన్ కబ్జాపై ఫిర్యాదు

ఉప్పల్: నాచారం డివిజన్‌లోని అన్నపూర్ణ కాలనీలో సర్వే నం. 106లోని పది గుంటల భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని కాలనీవాసులు డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. బఫర్ జోన్ స్థలం కబ్జా కాకుండా చూడాలని వినతిపత్రం అందజేశారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములు కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రషీద్(అశు), గుండు రమేష్ గౌడ్, సమద్, సుక్కల స్వామి పాల్గొన్నారు.

జవహర్ నగర్‌లో హైడ్రా అధికారుల పర్యటన

జవహర్‌నగర్: ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా అధికారులు కదం తొక్కారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు ఒక్కొక్కటిగా పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ భూములల్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై హైడ్రా అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. దాంతో హైడ్రా ఫీల్డ్ అధికారి రోహిత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ప్రవంతి, గిర్దావర్ వీరేంద్రసాయి జవహర్‌నగర్‌లో పర్యటించారు. సర్వే నం. 500, 501, 474లో నిర్మాణాలను పరిశీలించారు.

దళిత బంధు పథకం ఉన్నట్టా.. లేనట్టా?

ఆందోళనలో దళిత బంధు లబ్ధిదారులు

మేడ్చల్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): దళితబంధు పథకం ఉన్నట్టా..? లేనట్టా? అన్న ఆందోళనలో దళిత బంధు లబ్ధిదారులు ఉన్నారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలకు చెందిన దళిత బంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. దళితుల ఆర్థికాభివృద్ధికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి రెండో విడత దళిత బంధు పథకానికి నియోజకవర్గానికి 11 వందల మంది చొప్పున 5500 మందికి దళితబంధు పథకానికి ఎంపిక చేసిన విషయం విదితమే. అయితే, అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దళితబంధు పథకంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఎంపికైన లబ్ధిదారులు దళితబంధు పథకం అమలు చేస్తారా? లేదా? అన్నది స్పష్టత రావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో దళితబంధు పథకంలో జిల్లాలోని 500ల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి రూ. 50 కోట్లను నిధులను ఒక్కొక్కరికి రూ.10 లక్షలు అందించిన నేపథ్యంలో వివిధ వ్యాపారాలలో నిలదొక్కుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రెండవ విడతలో ఎంపికైన లబ్ధిదారులు దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు.

దళితబంధు పథకంపై స్టెటస్ కో...

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం స్టెటస్‌కో విధించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. రెండవ విడత దళితబంధు పథకంలో నియోజకవర్గానికి 11 వందల మంది చోప్పున ఎంపిక చేసిన స్టెటస్‌కో విధించడం మూలంగా దళితబంధు పథకం నిలిచిపోయింది. అయితే ఇటివల దళిత సంఘాలు దళితుల అభివృద్ధికి ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దళితబంధు పథకాన్ని ఎప్పటిలాగే కొనసాగించాలని ప్రభుత్వానికి సూచిస్తున్నారు. దళితబంధు పథకానికి ఎంపికైనా లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న దళితబంధు పథకంపై సరైన సమాదానం అధికారులు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఏది ఏమైన ప్పటికి దళితబంధు పథకాన్ని లబ్ధిదారులకు అందించి మూడో విడత దళితబంధు పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని దళిత సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వచ్చే నెల 1న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వచ్చే నెల 1న కాచిగూడ వైశ్య హాస్టల్‌లో నిర్వహిస్తున్న వధూవరుల పరిచయ వేదికను జంట నగరాల వాసులు, రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆర్యవైశ్యులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్యులకు మా వంతు సహాయంగా తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇతర వివరాలను ఫోన్ నం. 92465 47563, 98499 10303 లలో సంప్రదించవచ్చన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ జోనల్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, డీజెడ్‌హెచ్ రామకృష్ణన్, డీజీఎం సురేష్, రీజనల్ హెడ్ కనకరాజు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ);

సెప్టెంబర్ ఒకటి నుంచి పశు గణన

గోడ పత్రిక ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 21 వరకు అఖిల భారత పశుగణన కార్యక్రమం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రతి ఇంటికి సంబంధిత అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తారని చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం అఖిల భారత పశు గణన గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అన్ని పుశు జాతులు గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, గుర్రాలు, గాడిదలు, కుక్కలు తదితరవాటి వివరాలు సేకరిస్తారని చెప్పారు. నగరవాసులు పశువులకు సంబంధించిన సమాచారం అంతా ఇవ్వాలని అన్నారు. పశు గణన కొరకు 127 మంది ఎన్యుమారేటర్లు, 30 మంది సూపర్‌వైజర్లు, 92 వార్డులలో ఇంటింటిని సందర్శించి పశుగణను చేపడుతారని వివరించారు. జిల్లా పశు వైద్య, సంవర్ధక అధికారి డా.పి.వెంకటేశ్వర్లు, డీఈఓ రోహిణీ, నోడల్ అధికారి డా.సంజీవరావు పాల్గొన్నారు.

గాంధీలో బీసీ నాయకుల ఆమరణ దీక్ష

సంఘీభావం తెలిపిన పలువురు నేతలు

గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వారిని కలిసిన మధుసూదనా చారి, వి.హనుమంతరావు తదితరులు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 29: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్, బీసీ అజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ నేత ఐదు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. శాసన మండలి మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, బూర నర్సయ్య గౌడ్, బీసీ జన సభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, ఇన్‌చార్జి కె.వెంకట్ గౌడ్, బీసీ ఆజాద్ సంఘ్ అధ్యక్షుడు డి.మహేశ్ గౌడ్, కార్యదర్శి విజయ్ కుమార్, అఖిలేశ్ గౌడ్, బి.ప్రసాద్, డాక్టర్ వేణు, కె.వాసుదేవ్, బి.కీర్తి లతా, శ్రీనివాస్ యాదవ్, వెంకటరమణ, అంబేద్కర్ ఆజాదీ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరిలు దీక్ష చేపట్టిన వారిని గురువారం పరామర్శించి, తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డిలు ప్రకటించిన విధంగా బీసీలకు 42% కోటా ఇచ్చాకే ఎన్నికలకు వెళ్ళాలన్నారు. మాజీ ఎంపీ వీహెచ్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలోనే బీసీ గణన చేపడుతుందని, దీక్ష విరమించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు దీక్ష కొనసాగుతుందన్నారు.

గణేశ్ ఉత్సవ ఏర్పాట్లకు సమన్వయంతో పనిచేయండి

వారంలోగా పనులన్ని పూర్తి కావాలి: మేయర్

సిటీబ్యూరో, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): రానున్న గణేశ్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి అవసరమైన ఆయా ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికలతో పూర్తి చేయాలని మేయర్ గద్వాల విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. మేయర్ గద్వాల విజయలక్ష్మి శేరి లింగంపల్లి జోన్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం క్షేత్ర పరిధిలో పర్యటించి శానిటేషన్ పరిస్థితిని, రోడ్ల స్థితిగతులను, చెరువులను తనిఖీ చేసి ఆయా అధికారులకు పలు సూచనలు చేశారు. సెప్టెంబర్ ఏడో తేదీ నుంచి 17 వరకు గణేశ్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ఆయా అధికారులు సమన్వయంతో ముందస్తు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని మేయర్ చెప్పారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మల్కం చెరువు, గోపి చెరువు, నల్ల గండ్ల చెరువు, రాయ సముద్రం, సాకి చెరువు, గంగారం చెరువు, గౌతమ్ బేబీ పాండ్, కడియం కుంట, దుర్గం చెరువులను, రహదారులను మేయర్ పరిశీలించారు. సాకి చెరువు వద్ద గల బేబీ పాండ్‌ను గణేష్ నిమజ్జనానికి సిద్ధం చేయాలని తెలిపారు. చెరువుల సంరక్షణకు సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేయాలని మేయర్ పేర్కొన్నారు. గంగారం చెరువు చుట్టుపక్కల నివాసిత ప్రాంతాల్లో డెంగ్యూ కేసులను గుర్తించడం జరిగిందని, నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ శాఖ అధికారులకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు నివేదికను మేయర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఈ తనిఖీలో మేయర్‌తో పాటు జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, శానిటేషన్, లేక్స్, ఇంజనీరింగ్, తదితర విభాగాలు, పోలీసు ఉన్నత అధికారులు, కార్పొరేటర్లు గంగాధర్ రెడ్డి, రాగం నాగేందర్ యాదవ్, పుష్ప నగేష్ యాదవ్, మంజుల రఘునాథ్, శ్రీకాంత్, పూజిత జగదీశ్వర్ గౌడ్, హమీద్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అనంతరం, కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు తమకు బేసిక్ పే, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన పే స్కేళ్లను వెంటనే అమలు పరచాలని కోరారు. త్వరలోనే వర్సిటీలకు వీసీలను నియమిస్తామని, వర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక, అధ్యాపకేతర పోస్టులను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. అనేక ఏళ్లుగా వర్సిటీలనే నమ్ముకుని పరిశోధన, బోధనపై ఆసక్తితో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల గురించి ఎటువంటి ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. గత ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో విశ్వవిద్యాలయాలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులకు తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ పెద్దలను కలిసి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడం శోచనీయమన్నారు. తాము చేయాల్సిన విధులే కాకుండా మరెన్నో అదనపు బాధ్యతలను తాము మోస్తున్నట్టు వారు తెలిపారు. అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో అన్యాయానికి గురవుతూ జీవితాలను కొనసాగిస్తున్నామని వాపోయారు. తమకు యూజీసీ పేస్కేల్ అమలు చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 వర్సిటీలలో మొత్తం అధ్యాపక పోస్టుల ఖాళీలు 2,205 ఉండగా, కాంట్రాక్ట్ అధ్యాపకులు 1,445 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. వారి పోస్టులకు రక్షణ కల్పించి, మిగిలిన పోస్టులకు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉందని మంత్రులు చెప్పారని అన్నారు. త్వరలోనే వారి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాల నాయకులు డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ సురేశ్ నాయక్, డాక్టర్ దత్తహరి, డాక్టర్ సాదు రాజేశ్, డాక్టర్ కనకయ్య, డాక్టర్ చంద్ర శేఖర్, డాక్టర్ సనత్, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ శివ కుమార్ పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం ప్రోత్సాహకరం

మాదాపూర్, ఆగస్టు 29: నగరం పెట్టుబడులకు అనుకూలమని, దేశంలోని పలు మేనుఫ్యాక్చరింగ్ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చి యూనిట్లను ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో గురువారం సికింద్రాబాద్ ఎలక్ట్రికల్ ట్రేడర్స్ అసోసియేషన్ (సెటా) ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఎక్స్ పో–2024కు చెందిన 5వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు విచ్చేసి సీఐఐ, ఐజీబీసీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు వి.రాజ శేఖర్‌రెడ్డిలతో పాటు నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించడం జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దేశంలోని పలువురు మ్యానుఫాక్చరింగ్ కంపెనీలకు చెందిన యూనిట్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటూ ప్రోత్సహిస్తుందన్నారు. కొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చిన వారికి ప్రభుత్వం తరుపున ప్రోత్సాహం ఇస్తామన్నారు. అనంతరం, ఈ నెల 31వ తేదీ వరకు జరగనున్న ఈ ఎక్స్ పోలో పాలిక్యాబ్, ఫైన్ క్యాబ్, జెమ్స్, ఎలెంటి, ఫై ప్రోస్, కేఈఐ కంపెనీలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 15 నుంచి 20 వేల మంది సందర్శకులు విచ్చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏఐతో ప్రజలకు కచ్చితమైన సమాచారం

నిర్డ్ పీఆర్ ప్రొఫెసర్, సీడీసీ హెడ్ డాక్టర్ జ్యోతీస్ సత్యపాలన్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో ప్రజలకు కచ్చితమైన సమాచారం అందడంతో పాటు పాలనలో పారదర్శకత పెరుగుతుందని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (నిర్డ్‌పీఆర్) ప్రొఫెసర్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్, డాక్యుమెంటేషన్ అండ్ కమ్యూనికేషన్ (సీడీసీ) అధిపతి ప్రొఫెసర్ జ్యోతిస్ సత్యపాలన్ చెప్పారు. ఏఐ టెక్నాలజీతో తక్కువ సమయంలో ఎక్కువ పనిచేయడం సాధ్యమవుతుందని తెలిపారు. ఏఐ టెక్నాలజీని చెడు పనులకు వాడొద్దని సూచించారు. నిర్డ్ పీఆర్ ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో మాస్టరింగ్ కంటెంట్ క్రియేషన్' అంశంపై ఏర్పాటుచేసిన మూడు రోజుల శిక్షణ గురువారంతో ముగిసింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి శిక్షణకు హాజరైన అభ్యర్థులకు ప్రొఫెసర్ జ్యోతిస్ సత్యపాలన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఏఐ టూల్స్ ద్వారా కంటెంట్ రైటింగ్ ఎలా రాయాలో నేర్చుకున్నామని, ఫొటోను ఐదు నుంచి పది సెకండ్ల వీడియోగా మార్చే టెక్నిక్‌ను శిక్షణలో నేర్చుకున్నామని అభ్యర్థులు తెలిపారు. క్రీడియాడ్స్, ఆటోమోషన్ క్యాప్చర్, స్టాప్ మోషన్ స్టూడియో వంటి టూల్స్ ద్వారా రీల్స్ చేయడంలో తర్ఫీదు పొందామన్నారు. కార్యక్రమంలో కేరళకు చెందిన మాతృభూమి ఆన్‌లైన్ కన్సల్టెంట్ సునీల్ ప్రభాకర్, నిర్డ్ పీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీపీ సాహు, డాక్టర్ ఎంబీ రవిబాబు, అసిస్టెంట్ ఎడిటర్ కిష్ణరాజ్ కేఎస్, ఇప్రెస్సా ఫౌండర్ అంజలి చంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టరేట్‌లో ఆటల పోటీలు

మేడ్చల్, ఆగస్టు 29(నమస్తే తెలంగాణ): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను జిల్లా రెవెన్యూ అధికారి హరి ప్రియ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఆధ్వర్యంలో ఆర్ అండ్ వాక్, లెమన్ అండ్ స్పూన్, షాట్‌పుట్, త్రోబాల్, చెస్ బ్యాడ్మింటన్ వంటి ఆటల పోటీలు జరగగా, పోటీలలో కలెక్టరేట్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, ఏవో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ